## క్లుప్తంగా

### మహిళాభ్యుదయంతో ప్రగతి

పెదపూడి: మహిళల ఆరోగ్య పరిరక్షణకు అఖిల భారత మహిళా సమాఖ్య కృషి చేస్తుందని మహిళా ప్రతినిధి పాటంశెట్టి కాశీరాణి అన్నారు. కరకుదురు గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీరాణి మాట్లాడుతూ.. అఖిల భారత మహిళా సమాఖ్య శత వార్షికోత్సవం ఢిల్లీలో జరిగిందన్నారు. ఆ సమాఖ్య కాకినాడ శాఖ వారు కరకుదురు గ్రామాన్ని దత్తత తీసుకున్నారన్నారు. గ్రామంలో మహిళలకు వృత్తి నైపుణ్య కోర్సులను నేర్పించి, వారు స్వయం ప్రతిపత్తితో ఆర్థికాభివృద్ధి సాధించే విధంగా సమాఖ్య కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత మహిళా సంస్థ ప్రతినిధులు పెండెం శ్రీదేవి, విజయలక్ష్మి, పద్మలత, మహిళలు పేకేటి సూర్యకుమారి, మేడసాని సురేఖ, నున్న లక్ష్మి, మేడిశెట్టి లక్ష్మి, పసుపులేటి భవాని పాల్గొన్నారు.

### వేడుకగా భగినీ హస్త భోజనం



బ్రహ్మ కుమారీస్ ఆశ్రమంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి

పెదపూడి: అనపర్తిలో బ్రహ్మ కుమారీస్ వారి ఆశ్రమంలో అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధాన్ని తెలిపే భగినీ హస్త భోజనం (బ్రహ్మ భోజనం) కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. భగినీ హస్త భోజనం స్వీకరించారు. కార్యక్రమంలో అనపర్తి బ్రహ్మ కుమారీస్ ఇన్‌చార్జి సుశీల, ఆశ్రమం సోదరులు పాల్గొన్నారు.

### ఆదిత్యుడికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆలయంలో వ్రత పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేసింది.

### నేడు కార్తిక వన సమారాధన

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడితమామిడి వద్ద కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకట రామారెడ్డి తెలిపారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

### హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

రాజానగరం: సమాజంలో మానవ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్న తరుణంలో వాటిని కాపాడుకునేందుకు పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతో ఉందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి.వెంకట్ నాయుడు అన్నారు. కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యాలయంలో శ్రీకాకుళం గోదావరి లోయలో జరిగిన పోరాటాలలో అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. అమరులకు జోహార్లు అర్పించి కొద్దిసేపు మౌనం పాటించారు. అడవి సంపదను పెత్తందారీ కంపెనీలకు అప్పగిస్తూ గిరిజనుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతుందని ఆరోపించారు. జనిపెల్ల సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డెమోక్రసీ నాయకులు, రైతు కూలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### గ్రామోత్సవం.. చూచిన కనులదే భాగ్యం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

పెదపూడి: అనపర్తి కెనాల్ రోడ్డులో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయంలో మాలధారణ గావించిన స్వాములు స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో గ్రామ పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. పేటతుళ్లి నిర్వహించారు. అనపర్తి గ్రామం అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో మార్మోగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గురు స్వాములు, మాలాధారణ గావించిన స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# అన్నదాతకు వరుణ గండం

**మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ వరి కోతలు యంత్రాల సాయంతో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరాకు 30 బస్తాలు పైబడి దిగుబడులు వస్తున్నాయి. ఆశించిన దిగుబడులు అందుకుంటున్న తరుణంలో రైతన్నలను వరుణుడు వణికిస్తున్నాడు. పిలవకుండానే చినుకులతో పలకరిస్తుండటంతో చేతికి అంది వచ్చిన పంట ఏమైపోతుందోననే భయంతో అన్నదాతలు వణికి పోతున్నారు.**

- వర్షాలతో వణికిపోతున్న రైతన్నలు
- ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు
- ఆశించిన దిగుబడి అందుకునే తరుణం
- కోతల సమయంలో చిరు జల్లులతో ఆందోళన

రాజానగరం: జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఖరీఫ్ వరి గింజ కట్టే దశలో ఉంటే రాజానగరం, అనపర్తి నియోజక వర్గాల పరిధిలో మాత్రం చాలా చోట్ల కోతలు ప్రారంభమయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం ఈ నియోజవర్గాల పరిధిలో 64,695 ఎకరాలలో వరి పంట సాగు చేశారు. అయితే ఈ సీజన్‌లో ప్రారంభం నుంచి ప్రకృతి వైపరీత్యాలు రైతన్నలను వెంటాడుతూనే ఉన్నాయి. అయినా అన్నింటినీ అధిగమించి సాగుతో ముందడుగు వేసిన అన్నదాతలను పిలువకుండానే పలకరిస్తున్న వర్షాలు కంగారు పెట్టిస్తున్నాయి. ఒడిదుడుకులను అధిగమించి, పంటను పండించిన వారికి ఆ పంట చేతికి అందే తరుణంలో అల్ప పీడనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఆందోళనకు గురి చేస్తోంది.

**నాటిన చోటనే నాటారు..**

సాధారణంగా వరి నాట్లు అయిన తరువాత పంట చేతికి వచ్చే వరకు పలు రకాల ఎరువులు, పురుగు మందులు పంటకు వాడుతూ మంచి దిగుబడులు అందుకునేందుకు రైతులు తాపత్రయ పడుతుంటారు. అయితే ఈ సీజన్‌లో తరచు అల్ప పీడనాలు, తుపాన్లు సంభవించడంతో కొన్ని చోట్ల నాటిన నాట్లు ముంపుకు గురై పాడైపోవడంతో నాటిన చోటనే మరోసారి నాట్లు వేయవలసి వచ్చింది. ఈ విధంగా ఖర్చులు అధికమయ్యాయి. అయినప్పటికీ తెగుళ్ల బెడద పెద్దగా లేకపోవడంతో దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశల మేరకు దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్న తరుణంలో బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురియనున్నాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో కంగారు పడుతున్నారు.

**ముమ్మరంగా వరి కోతలు..**

ప్రస్తుతం నియోజకవర్గంలో పలు చోట్ల వరి పంట కోతలు యంత్రాల సాయంతో ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని నరేంద్రపురం, కలవచర్ల, తూర్పుగానుగూడెం, వెలుగుబంద ప్రాంతాలలో ఇప్పటికే చాలా వరకు కోతలు పూర్తి కాగా కొండగుంటూరు, నామవరం, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, తుంగపాడు తదితర ప్రాంతాలలో ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతాలలో కొన్ని పొలాలు కోతలకు సిద్ధంగా ఉంటే మరికొన్ని పొలాలలో గింజ తొడిగే దశలో వరి పంట ఉంది. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు కోసిన వెంటనే మిల్లర్లు పొలాల నుంచే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ సమయంలో వర్షాల కురియడం వలన ఆ ధాన్యం తడిచి, మిల్లర్లు కొనుగోలు చేయడానికి అవకాశం లేకుండా పోతుందని వాపోతున్నారు. అలాగే వరి పంట గింజ కట్టే పొలాలలో గాలులతో కూడిన వర్షాలకు పంట నేలకొరిగితే పంట దెబ్బతిని పొల్లుగా మారుతుందని భయపతున్నారు.



యంత్ర సహాయంతో వరి కోత జరుగుతున్న దృశ్యం

**గింజ కట్టే పొలాలకు దెబ్బ**



ప్రస్తుత సమయంలో వర్షాలు కురియడం వ్యవసాయానికి ముఖ్యంగా వరి పంటకు అంత మంచిది కాదు. ఈ ఏడాది రైతులు ఒకటికి రెండు సార్లు వరి నాట్లు వేసి ఎన్నో వ్యయ ప్రయాసలు పడ్డారు. అందివచ్చిన పంటను దక్కించుకునే సమయంలో వర్షాలు కురిస్తే పంట దెబ్బతింటుంది. కోతలు జరిగే చోట ధాన్యం తడిచిపోయి మొలకలు వస్తాయి. గింజ కట్టే దశలో ఉన్న పంట పొల్లుగా మారుతుంది.

పి. రామకృష్ణ, రైతు, సంపత్ నగరం.

**వర్షాలు వరికి మంచిది కాదు..**



నరేంద్రపురం పరిసర గ్రామాలలో చాలా వరకు వరి పంట కోతలు పూర్తి కావొచ్చాయి. అక్కడక్కడా ప్రస్తుతం యంత్రాల సాయంతో కోతలు జరగుతున్నాయి. ఈ సమయంలో వర్షాలు కురిస్తే వరి పంటకు అంత మంచిది కాదు. కోతలు జరిగే చోట ధాన్యం తడిచి అమ్ముకోడానికి వీలు కాదు. అంతేకాక పొలాలు తడిచి, యంత్రాలతో కోతలు చేపట్టడానికి ఆటకంగా ఉంటుంది.

ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం.

### అనాథ వృద్ధురాలికి వైద్య సేవ



వృద్ధురాలికి వైద్యం చేస్తున్న వైద్యురాలు ప్రజ్ఞ

మధురపూడి: ఆహారం లేక సొమ్మసిల్లి పడిపోయిన ఓ అనాథ వృద్ధురాలికి వైద్య సేవలందించి మానవత్వాన్ని చాటుకున్న ఘటన కోరుకొండలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సుబ్బయమ్మ అనే అనాథ వృద్ధురాలు ఆదివారం మధ్యాహ్నం కోరుకొండ శ్రీలక్ష్మీ నర సింహస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న ఓఇంటి గోడకు ఆనుకొని పడిపోయింది. అటుగా వెళ్లిన స్థానికులు కోరుకొండ పీహెచ్‌సీ వైద్యురాలు ప్రజ్ఞకు తెలియజేశారు. స్పందించిన వైద్యురాలు స్థానిక పంచాయతీ అధికారులు, సర్పంచ్ సహకారంతో వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆహారాన్ని అందించారు. దీంతో వృద్ధు రాలు తేరుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను స్వామివారి ఆలయం మెట్ల వద్ద దించి వెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు.

### సాయి అఖండ నామ జపయజ్ఞం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి షిరిడీ సాయిబాబా ఆలయంలో సాయి అఖండ నామ జపయజ్ఞంతో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, చైర్మన్ కంటే నాగ కేశవరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. డిశంబరు 2న పూర్ణాహుతి నిర్వహించనున్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు పురస్కారాలు



కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సింగవరం పంచాయతీ కార్యదర్శి స్వప్న

సీతానగరం: మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు ఈ నెల 2న జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. టీబీ ముక్త భారత్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2023లో టీబీ వ్యాధి నిర్మూలనలో విశేష కృషి చేసిన సీతానగరం, సింగవరం, పురుషోత్తపట్నం, చీపురుపల్లి, ముగ్గళ్ల, కూనవరం, వెదుళ్లపల్లి, కాటవరం, జాలిమూడి, మునికూడలి, ములకల్లంక, మిర్తిపాడు గ్రామ పంచాయతీలను టీబీ ముక్త పంచాయతీలుగా ప్రభుత్వ గుర్తించిందని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శులు కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వీరిని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ అధికారులు అభినందించారు

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



షేక్ నజీర్



బండారు బిందుహాసిని



ఇళ్ల సంధ్యా స్రవంతి



కురుపూడి లాస్య



మీసాల నవ్య

పెదపూడి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, క్రికెట్, త్రోబాల్ పోటీలకు అనపర్తి పాతఊరులోని కేఏఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం కర్రి సుజాత తెలిపారు. ఇటీవల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. అథ్లెటిక్స్‌లో అండర్–14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో షేక్ నజీర్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అండర్ –14 క్రికెట్ విభాగంలో షేక్ నజీర్ త్వరలో అమాలపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. అండర్–14 త్రోబాల్ లో బండారు బింధు హాసిని, ఇళ్ల సంధ్య స్రవంతి, అండర్–17 త్రోబాల్‌లో కురుపూడి లాస్య, మీసాల నవ్య, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, పీడీ పి.శ్రీనివాసారెడ్డిని ఉపాధ్యాయ బృందం, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రాజానగరం: దివాన్ చెరువులోని పీజీఎం పాఠశాలలో 2011–14 మధ్య కాలంలో పదో తరగతి చదువుకున్న మూడు బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు లాలాచెరువులోని గోదావరి మహా పుష్కర వనంలో ఆదివారం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. గడచిన పదేళ్లలో వచ్చిన మార్పులు, సాధించిన ప్రగతిని ఒకరి కొకరు చెప్పుకొంటూ కుశల ప్రశ్నలతో సరదాగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. తిరిగి స్వస్థలాలకు పయనమయ్యారు.

## కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ



రాజానగరంలో పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు



రంగంపేటలో అయ్యప్ప పడిపూజ

రాజానగరం: స్థానిక గాంధీ బొమ్మ సెంటరులోని వినాయకుడి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్ప దీక్షా ధారులతో అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించి, మధ్యాహ్నం గ్రామంలో ఊరేగుతూ పేటతుళ్ల నిర్వహించారు. రాత్రి పడిపూజ జరిగింది. కార్యక్రమానికి రాజానగరం, నరేంద్రపురం, వెలుగుబంద, చక్రద్వార బంధం, దివాన్‌చెరువు, నందరాడ, సీతారామపురం, కలవచర్ల, వెంకన్నపేట, రామస్వామిపేట, ఎస్టీరాజపురం, ఫరిజల్లిపేట, కానవరం, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడ తదితర గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు భారీగా తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రంగంపేట: కార్తిక మాసంలో శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించడానికి అయ్యప్ప దీక్షలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మణికంఠ క్షేత్రం వద్ద గురుస్వామి చొల్లంగి అర్జునరావు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి నిర్వహించిన లక్ష బిల్వార్చన, పడిపూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన గురుస్వామి అర్జునరావును ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం మండల వ్యాప్తంగా తరలివచ్చిన అయ్యప్ప మాల ధారులతో పడిపూజ ఘనంగా నిర్వహించారు. శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన డప్పు శ్రీను కళా బృందం ఆలపించిన అయ్యప్ప నామ సంకీర్తన ఆద్యంతం అలరించింది. మంటపంలో స్వామి వారిని వేలాది మంది దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు కాగడాల హారతులతో అయ్యప్ప మాల ధారులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

## రామలింగేశ్వరుడికి లక్షపత్రి పూజ



కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి



శివలింగాకారంలో భక్తులు వెలిగించిన దీపాలు

పెదపూడి: అనపర్తి పాత ఊరిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తిక నిత్య మాస పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగదేవర చందు శర్మ అధ్వర్యంలో పది మంది రుత్వికులు పూజలు చేశారు. ముందుగా విఘ్నేశ్వర పూజతో పూజలు ప్రారంభించారు. గోత్ర నామాలతో లక్షపత్రి పూజ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సామూహిక కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం రుద్రహోమం, అన్నాభిషేకం, జ్యోతిర్లింగార్చన, నీరాజనం, మంత్ర పుష్పాలతో ఆశీర్వచనాలు చేశారు. రాత్రి కార్తిక దీపోత్సవం నిర్వహించారు. శివలింగాకారంలో భక్తులు దీపాలు వెలిగించారు.

రంగంపేట: మండల వ్యాప్తంగా శివాలయాలు కార్తిక మాస పూజలు నిర్వహిస్తున్న భక్తులతో కిటకిటలాడుతున్నాయి. చంద్రేడులో కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి, రంగంపేటలో ఉమా రామలింగేశ్వర స్వామి, వడిశలేరు, సుభద్రంపేట, పెదరాయవరం, సింగంపల్లి, ముకుందవరం, జి.దొంతమూరు శివాలయాల్లో వేకువ జామునుంచే భక్తులు శివుడికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేపట్టారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు.



లక్ష పత్రి పూజ చేస్తున్న అర్చకులు

### పండ్ల తోటలకు కోతుల బెడద




బూరుగుపూడిలో కోతులు ధ్వంసం చేసిన బత్తాయి తోట

**బత్తాయి, జామ తోటల్లోని పండ్లు ధ్వంసం**

మధురపూడి: పండ్ల తోటలకు కోతుల బెడద ఏర్పడింది. మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలోని బత్తాయి, జామ, బొప్పాయి, సపోటా తదితర పండ్ల తోటల్లో పక్వానికి వచ్చిన పండ్లతో పాటు, పక్వానికి రాని కాయలను సైతం వానరాలు ధ్వంసం చేస్తున్నాయి. రాజానగరం నియోజవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 18,520 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటలున్నాయి. బత్తాయి, బొప్పాయి తదితర పండ్లు సాగవుతున్నాయి. పండ్లను కోతులు చిందర వందర చేయడంతో తోటల యజమానులు నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోతులను పట్టుకొని సుదూర ప్రాంతానికి తరలించాలని రైతులు కోరుతున్నారు.

### మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం



మాట్లాడుతున్న షేక్ సుల్తాన్

సీతానగరం: మండలంలోని వంగలపూడి మసీదులో ముస్లిం కమ్యూనిటీ జిల్లా వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు షేక్ సుల్తాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జ్ మౌల్వీ ఎమ్ఏ జాఫర్ ఖాన్ పవిత్ర ఖురాన్ గ్రంథం పఠనం చేశారు. జిల్లా అధ్యక్షులు సుల్తాన్ మాట్లాడుతూ యాచించే చేతుల కన్నా దానం చేసే చేతులు మిన్న అని మహమ్మద్ ప్రవక్త బోధించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ముహమ్మద్ సిరాజ్, మసీదు ప్రెసిడెంట్ షేక్ ఖాసీం ఫారూఖ్ నానాజీ, షేక్ అహ్మద్ అలీవుద్దీన్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## వన సమారాధనలతో సమాజాభివృద్ధి


**మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**



ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న జక్కంపూడి రాజా

రాజానగరం: సమాజంలో ప్రజల మధ్య సమైక్యతను ఏర్పరచి, సమాజాభివృద్ధిలో వారు కూడా భాగస్వాములయ్యేలా చేయడమే వన సమారాధనల ముఖ్యోద్దేశమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులో శ్రీలక్ష్మీ గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా వన సమారాధనలు నిర్వహిస్తూ, వర్తక సంఘంలో ఉన్న సమైక్యతను చాటుతున్న వారి కృషిని అభినందించారు. దేశాభివృద్ధిలో వర్తకుల పాత్ర గణనీయమైనదని అన్నారు. నిర్వాహకులు ఆహ్వానితులకు స్వాగతం పలికారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మాజీ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, గంగిశెట్టి సోమేశ్వర్రావు, శ్రీను, ధర్మరాజు, వల్లభశెట్టి సత్యనారాయణ, మందార వెంకీ, కూటమి నాయకులు గంగిశెట్టి చంటిబాబు, దేశాల శ్రీను, దాసరి శ్రీను, వర్తక సంఘం ప్రతినిధులు గ్రంధి నానబ్బులు, వీరపండు, గ్రంధి గణేష్, హర్ష, సత్తిబాబు, దుర్గారావు, రమణ, పాల్గొన్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతుడు నిమ్మలపూడి సత్యసాయి (ఫైల్)

రంగంపేట: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. గండేపల్లి మండలం పాత నాయకంపల్లి గ్రామానికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి (22) ఇంటర్ వరకు చదివి తన అన్నయ్య సాయికృష్ణతో కలిసి రంగంపేట మండలం కోటపాడు గ్రామంలో కోళ్లఫారం నిర్వహిస్తున్నాడు. అక్టోబరు 12న తన స్నేహితులతో కలిసి అయ్యప్ప మాల ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. గత నెల 30న స్నేహితుడైన రాజేష్ క్రెడిట్ కార్డు అతనికి తెలియకుండా తీసి దాని ద్వారా సత్యసాయి పెట్రోల్ కొనుగోలు చేశాడు. అయితే క్రెడిట్ కార్డు తీసిన సంగతి రాజేష్‌కు తెలియడంతో రాజేష్ ఎక్కడ నిలదీస్తాడోనని భయపడి మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో 31న ఉదయం నాలుగు గంటలకు పూజ ఉందని ఇంట్లో వాళ్లకు చెప్పి బయటకు వెళ్లి కోటపాడు గ్రామ శివారు సుకృతి లే అవుట్‌లో ఒంటికి నిప్పు అంటించుకొని మృతి చెందాడు. మృతుని అన్నయ్య, బంధువులతో కలిసి సుకృతి లే అవుట్‌లో ఈ నెల 2న గాలిస్తుండగా కాలిన గాయాలతో మృతి చెంది కనిపించాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణసాయి తెలిపారు.

### ఘనంగా గౌరీదేవి విగ్రహ ప్రతిష్ఠ



బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో గౌరీదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మహా సంప్రోక్షణ, ద్వార పాలకుల ప్రతిష్ఠ, అమ్మవారి దృషి కుంభ దర్శనం, గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 4న ఉదయం కుంభాభిషేకం, రాత్రి గౌరీదేవి సంబర మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. 5న భారీ అన్న సమారధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.